www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024 5 ఏలూరు



జాతీయస్థాయి పోటీలకు గుండుగొలను విద్యార్థి

భీమడోలు : చత్తీస్‌ఘడ్‌లో ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించే స్టాప్ బాల్ జాతీయస్థాయి పోటీల్లో మండలంలోని గుండుగొలను హై స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి గంటా అజయ్ రాష్ట్ర జట్టు సభ్యునిగా పాల్గొననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గారపాటి కనకదుర్గ సునీత, పీడీ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల గుంటూరులో స్టాప్ బాల్(అండర్-14 విభాగం) రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. జిల్లా సభ్యునిగా పోటీల్లో పాల్గొన్న అజయ్ కనబరిచిన ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్టు సభ్యునిగా నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈమేరకు రాష్ట్ర జట్టు ప్రతినిధిగా జాతీయ స్థాయి పోటీల్లో అజయ్ పాల్గొననున్నాడని వారు తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన అజయ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల పీడీ, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారావుతో పాటు పలువురు గ్రామ ప్రముఖులు అభినందించారు.

పార్లమెంట్‌లో గళమెత్తేనా..!

- జిల్లాలో ప్రధాన సమస్యలపై ఎంపీలు మౌనం
- కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌తో ప్రజల్లో అలజడి
- పోలవరం నిర్వాసితులకు అందని పరిహారం
- ధర లేక పామాయిల్ రైతులు విలవిల
- కౌలురైతులకు వర్తించని పిఎం కిసాన్ సమ్మాన్ నిధి
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మోడీ ప్రభుత్వానికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తి కానుండటంతో ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు. ఈ సమావేశాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టనున్నారు. అయితే జిల్లాకు సంబంధించి కేంద్రం పరిధిలో అనేక సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణ ఎన్నికల ముందు జరుగుతున్న ఈ సమావేశాల్లో ప్రధాన సమస్యలను జిల్లాకు చెందిన ఎంపీలు లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య ప్రధానమైందని చెప్పొచ్చు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చట్టంలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును సంబంధించిన ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ఖర్చుకు సంబంధించి డిపిఆర్‌ను తయారు చేసి కేంద్రానికి పంపించింది. ప్రాజెక్టుకు మొత్తం రూ.58 వేల కోట్లు వరకూ అవుతుందని, అందులో రూ.32 వేల కోట్లు నిర్వాసితులకు పరిహారంగా అందించాల్సి ఉందని తెలిపింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచిపోయింది. పోలవరం ప్రాజెక్టు 80 శాతం వరకూ పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. ఇప్పటి వరకూ మాత్రం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం మాత్రం అందించలేదు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 103 గ్రామాల పరిధిలో 20 వేలకుపైగా కుటుంబాలు నిర్వాసితులు కానున్నాయి. వీరికి పునరావాస ప్యాకేజీ, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, ఇళ్ల నిర్మాణం వంటివి చేయాల్సి ఉంది. పరిహారం ఇస్తే తప్ప తాము గ్రామాలను ఖాళీ చేసే ప్రసక్తే లేదని నిర్వాసితులు చెబుతున్నారు. కేంద్రం నిధులిస్తే తప్ప నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేమని సిఎం జగన్ తేల్చి చెప్పేశారు. దీంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న వరదలకు గ్రామాలన్నీ ముంపుబారిన పడటం, నిర్వాసితులంతా కొండలు, గుట్టలపై బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించడం వంటి భయంకర పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఏలూరు, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల్లో నిర్వాసితుల సమస్య ప్రధానంగా ఉంది. నిర్వాసితుల సమస్యను చివరి పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఎంపీలు లేవనెత్తి పరిహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరుపై కేంద్రం మోసం

2014 ఎన్నికల సందర్భంగా భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, కొల్లేరుకు న్యాయం చేస్తామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ పోటీ చేసి గెలవడం సైతం జరిగింది. కొల్లేరులో సర్వే పేరుతో అప్పట్లో కేంద్ర ప్రభుత్వం హడావుడి సైతం చేసింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించకుండా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించకపోగా, తాజాగా కొల్లేరు ఎకోసెన్సిటివ్ పేరుతో ఐదో కాంటూరు వరకూ విస్తరించేందుకు కేంద్రం సిద్ధమవగా, రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోంది. కొల్లేరులో హెలీకాప్టర్‌తో సర్వే నిర్వహించారు. మండల కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు నిర్వహించి గతంలో ఉన్న 120 గ్రామాలు కాకుండా మరో 89 గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి తెచ్చేందుకు నివేదికలు తయారు చేశారు. దీన్ని కొల్లేరు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్న పరిస్థితి ఉంది. ఎకోసెన్సిటివ్ జోన్ అమల్లోకి వస్తే కొల్లేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధి మొత్తం ఆగిపోనుంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించడం, ఎకోసెన్సిటివ్ జోన్ నిలుపుదలపైనా జిల్లాకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలురైతులకు పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ఏది?

జిల్లాలో అత్యధికంగా మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. రాష్ట్రంలోనూ అత్యధికంగా కౌలురైతులు వ్యవసాయ సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏడాదికి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అందించే రూ.ఆరు వేల సాయం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందడం లేదు. దీంతో కౌలురైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఈసారి పిఎం కిసాన్ నిధి కింద ఇచ్చే సొమ్ము రూ.తొమ్మిది వేలకు పెంచనున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే క్రమంలో తమకూ వర్తించేలా ఎంపీలు పార్లమెంట్‌లో గళమెత్తాలని కౌలు రైతులు కోరుతున్నారు. జిల్లాలో లక్షా 50వేల ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. ఆయిల్ దిగుమతులపై కేంద్రం పన్ను తగ్గించడంతో దేశీయంగా పండించే పామాయిల్ ధర భారీగా పడిపోయింది. టన్ను పామాయిల్ ధర ఈ ఏడాది రూ.12,200 మాత్రమే పలికింది. గతేడాది టన్ను రూ.23 వేలు వరకూ పలికిన పరిస్థితి ఉంది. పామాయిల్ ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం జిల్లాలోని పామాయిల్ రైతులపై తీవ్ర ప్రభావం పడింది. పామాయిల్ రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడి ధర విషయంలో న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇక జిల్లాలో సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో బ్రిడ్జిలు నిర్మించిన చోట సర్వీసు రోడ్లు నిర్మించడం లేదు. దీంతో రైతులు తాము పండించిన పంటను తరలించే పరిస్థితి లేకుండా పోతుంది. సర్వీసు రోడ్ల నిర్మాణంపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడాలని రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, హాజరైన ఆహ్వానితులు

పరిశ్రమల్లో భద్రతను పటిష్టం చేయాలి

భద్రతా చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవు - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో అగ్నిమాపక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా అగ్నిమాపకశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారని, మరోసారి 15 రోజులు పనిదినాల గడువుతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని జిల్లా ఫైర్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అప్పటికీ ఆయా యాజమాన్యాలు స్పందించని పక్షంలో సెక్షన్-12 కింద కేసు నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతాచర్యలను మరింత పటిష్టం చేయాలన్నారు. జిల్లాస్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణా మండలి, అగ్నిమాపక శాఖ, పోలీసు, రవాణా, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆయా పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత ఎమర్జెన్సీని కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు కల్పించాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొటోకాల్ చర్యలను కచ్చితంగా పాటించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ఆయా కంపెనీల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తరచూ ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజాము సమయాల్లో మాక్‌డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్మికుల్లో, ప్రజల్లో, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్గించాలన్నారు. ప్రమాదాలు సంభవించే సమయాల్లో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు, ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రత్యామ్నాయ మార్గాలను స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో తనిఖీ చేసి అవసరమైన కార్యాచరణను నెలరోజుల్లో సమర్పించాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాల సమయంలో బాధితులను పరిసర ప్రాంతాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలను, డ్రైవర్లను అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఆర్‌టిసి, 108 తదితర డ్రైవర్లకు అవసరమైన శిక్షణను అందించాలన్నారు. ముఖ్యంగా ఆర్‌టిసి, ప్రయివేట్ ఎసి బస్సుల్లో ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు సంభవించే సమయంలో ప్రజలను పునరావాసానికి తరలించేందుకు అవసరమైన షెల్టర్లను గుర్తించడం, తాగునీరు, ఆహార పదార్థాలు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచేందుకు ముందస్తు కార్యాచరణ అందుబాటులో ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మాస్ క్యాజువాలిటీ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు, యాసిడ్ ప్రమాదాలు మూలంగా అయ్యే గాయాలకు అవసరమైన చికిత్సతోపాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ కూడా రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాధరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఉప రవాణా కమిషనర్ శాంతికుమారి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎన్‌డిఆర్ఎఫ్ జి.ఈశ్వరరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, గెయిల్, హెచ్‌పిసిఎల్, జిఎస్‌పిఎల్ సంస్థల ప్రతినిధులు, వివిధ పరిశ్రమలకు చెందిన ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఆరంభం

కదంతొక్కిన కల్లుగీత కార్మికులు

పట్టణంలో మోకులతో ర్యాలీ

వృత్తిని కాపాడేవారికే మద్దతు : 80 వసంతాల సభలో నేతలు



తణుకులో మోకులు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

తణుకురూరల్: 'కల్లు తాగడం ఆరోగ్యకరమే.. అయినా గీత వృత్తిని దెబ్బతీస్తూ ప్రజల ప్రాణాలను హరించే మద్యం అమ్మకాలను ప్రభుత్వం ప్రోత్సహించడం దారుణం. ప్రభుత్వం తన తీరు మార్చుకుని గీతవృత్తి పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం.. గీతకార్మిక వృత్తిని పరిరక్షించేలా ఎన్నికల ప్రణాళికలో విధానాలు ప్రకటించిన వారికే మా మద్దతు' అంటూ కల్లుగీత కార్మికులు మంగళవారం తణుకు పట్టణంలో కదంతొక్కారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి నరేంద్ర సెంటర్, వెంకటేశ్వర సెంటర్ మీదుగా లయన్స్‌క్లబ్ ఆడిటోరియం వరకూ సాగింది. ర్యాలీ అగ్రభాగాన గీత కార్మికులు, నేతలు మోకులు ధరించి పాల్గొనడం అందరి దృష్టిని ఆకర్షించింది. అనంతరం సంఘం ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా లయన్స్ ఆడిటోరియంలో 80 వసంతాల సభ నిర్వహించారు. ఈ సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షత వహించారు. తొలుత కీర్తిశేషులు సంఘం సీనియర్ నేత చిటకన వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో గీత కార్మికుల బతుకులు మారాలని మోకులు ధరించి రోడ్లపైకి వస్తున్నారంటే జగన్మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. కూల్‌డ్రింక్స్, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, కల్లు ఆరోగ్యానికి మంచిదన్నారు. వృత్తి రక్షణ, ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే కల్లుగీత కార్మికుల జీవితాలు బాగుపడేలా చర్యలు తీసుకునేవారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సంఘం మాజీ జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ పాదయాత్రలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిని, ఉపాధిని కార్మికులు సంఘటితంగా రక్షించుకోవాలన్నారు. చీప్‌లిక్కర్, బ్రాందీలను ప్రోత్సహించి లాభాలు గడిస్తున్నారని, కల్లు వల్ల ప్రభుత్వానికి లాభాలుండవనే పేరుతో గీత వృత్తిని నిర్వీర్యం చేస్తుందన్నారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ఐదు సంవత్సరాలు ఎదురుచూసినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని విమర్శించారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే, గీత కార్మికులు చెట్లు ఎంత వేగంగా ఎక్కగలరో, కల్లు ఎంత వేగంగా దించగలరో అంతే వేగంతో ప్రభుత్వాన్ని దించగలరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల వీరరాఘవులు, సహాయ కార్యదర్శి కడలి పాండు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నేతలు పివి.ప్రతాప్, గార రంగారావు, గుబ్బల గోపి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకటసుధాకర్, కోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాజగోపాల్, దొమ్మేటి వెంకట సుధాకర్

పిఎంఇజిపి దరఖాస్తుల్లో లోపాలు లేకుండా చూడండి

8 పరిశ్రమలకు రూ.55.40 లక్షల రాయితీ మంజూరు


ప్రజాశక్తి - ఏలూరు

పిఎంఇజిపి లబ్ధిదారులు ఆయా పరిశ్రమల ఏర్పాటుకు చేసుకునే సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు, దరఖాస్తుల్లో లోటుపాట్లు లేకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఇజిపి కింద పరిశ్రమల ఏర్పాటుకు డిఐసి, కెవిఐసి, కెవిఐవి ద్వారా బ్యాంకులకు సమర్పించే దరఖాస్తుల్లో మార్గదర్శకాలకు అనుగుణంగా సరైన రీతిలో చేసిన దరఖాస్తులు, సరైన విధానంలో సమర్పించని దరఖాస్తులను, ఫీజిబిలిటి నివేదికల్లో కొన్నింటిని తన దృష్టికి తీసుకువస్తే వాటిలో కొన్నింటిని ఎంపిక చేస్తామన్నారు. వాటిని ఎంఎస్ఎంఇ శిక్షణా అవగాహన కార్యక్రమంలో లబ్ధిదారులకు చూపించి వాటిలో ఉన్న వ్యత్యాసాలను చూపి వారికి అవగాహన పరచాలని పరిశ్రమల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సంబంధించిన 511 దరఖాస్తులను రుణాలందించేందుకు బ్యాంకర్లకు పంపించగా, వాటిలో 210 దరఖాస్తులను వివిధ కారణాలతో బ్యాంకర్లు తిరస్కరించడం, మరో 189 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ స్పందిస్తూ దరఖాస్తులో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకునేలా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, లోటుపాట్లు సరిచేసి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో పథకం ద్వారా 297 దరఖాస్తులు అందగా, వాటిలో 283 దరఖాస్తులు వివిధ శాఖల ద్వారా ఆమోదించామన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ కింద జిల్లాలోని ఎనిమిది ఎంఎస్ఎంఇ, వైఎస్ఆర్ బడుగు వికాసం యూనిట్లకు రూ.55.40 లక్షలు వివిధ ప్రోత్సాహకాలను మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది. జిల్లాలో 10 లేదా అంతకుమించి మహిళా కార్మికులు ఉన్న పరిశ్రమల్లో పిల్లలకు పాలిచ్చే ప్రత్యేక గదులు, చైల్డ్‌కేర్ గదులను ఏర్పాటు చేసే చర్యలను కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఎపిఐఐసి జెడ్ఎం బాబ్జి, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్, ఉప రవాణా కమిషనర్ శాంతికుమారి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలి

జెఎసి జిల్లా ఛైర్మన్ సుబ్బారావు

ఏడవ రోజు కొనసాగిన సెర్ప్ ఉద్యోగుల సమ్మె



సమ్మెలో ఉద్యోగులతో పాటు చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేడర్లు, పే స్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి, ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్.సుబ్బారావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెర్ప్ ఉద్యోగుల జెఎసి చేపట్టిన నిరవధిక సమ్మె ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏడవ రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరు చేయబడిన పోస్టులపై వెంటనే జిఓ ఇవ్వాలన్నారు. మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం దీక్ష శిబిరానికి విచ్చేసి ఉద్యోగుల మెడలో నూలుదండలు వేసి మద్దతు తెలిపిన దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. సెర్ప్ ఉద్యోగులు చేసే పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని, తాము అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి మెంబర్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

వీడని పెద్దపులి భయం.. వణుకుతున్న జనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని రామసింగవరం గ్రామంలో పెద్దపులి భయంతో గ్రామస్తులు వణికి పోతున్నారు. మంగళవారం తెల్లవారుజామున పొలాల్లో దూడ నెత్తికెళ్లి తినేసిందని గ్రామస్తులు తెలిపారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పొలానికి పాలు తీయడానికి వెళ్లిన రైతు పులిని చూసి భయంతో చెట్టుపైకి ఎక్కి కూర్చొని గ్రామస్తులకు ఫోన్ ద్వారా భయంతో తెలుపగా గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అటవీ శాఖ వారు పులి ఆనవాళ్లను పరిశీలించి పులి సంచరించినట్లు నిర్ధారించారు. రామసింగవరం చుట్టుపక్కల గ్రామస్తులు రెండు రోజులు పొలాలకు పనులకు వెళ్లకుండా ఉండాలని గ్రామ సర్పంచి టాంటాం వేయించారు.

పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహశీల్దార్ బి.సుమతి

పోలవరం : బుట్టాయగూడెం సరిహద్దు పంచాయతీలైన పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డి పేట, నాగం పాలెం, గెడ్డపల్లి పంచాయతీల్లోని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పోలవరం తహశీల్దార్ బి.సుమతి సూచించారు. బుట్టాయగూడెం మండలంలోని పలుచోట్ల పులి సంచరించిన పాదముద్రలు లభించినందున పరిసర గ్రామాల్లో కూడా పులి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పులి సంచారంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజలు వేకువ జామున, చీకటి పడిన తరువాత సాధ్యమైనంత వరకు బయట తిరగకుండా ఇళ్ల వద్ద ఉండాలని, ఇంటి ఆరు బయట, పశువుల పాకల వద్ద నిద్రించరాదని, పులి తిరుగుతున్న ప్రాంతాలలో అడవిలోకి వెళుటకు సాహసించరాదని తెలిపారు. పులులు సంచరించే ప్రాంతాల్లో పశువులను బహిరంగ ప్రదేశాల్లో ఉంచవద్దని, మీప్రాంతంలో పులి తిరుగుతున్న ఆనవాళుగాని, పాదముద్రలు గాని కనిపిస్తే తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. పులిని అనుసరించుటకు ప్రయత్నించరాదని, పులిని, ఇతర ఏ అటవీ జంతువులను వేటాడుట, హింసించుట చేస్తే వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం నేరం, శిక్షార్హులని అన్నారు. పైన తెలిపిన సూచనలు పాటించి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పట్టిసీమ ఫెర్రీ ఘాట్ పరిశీలన

కాలినడక రహదారి పనులకు చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ గోదావరి మధ్యలో వేంచేసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు నది దాటి వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసే కాలి నడక రహదారి పనులు ప్రారంభించేందుకు అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టిసీమ ఫెర్రీ పాయింట్ వద్ద గత సంవత్సరం ఏర్పాటు చేసిన కాలినడక రహదారి ప్రదేశంలో గోదావరి నది లోతు, వెడల్పు పరిశీలించారు. మార్చి ఎనిమిదో తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పట్టిసీమలో అధికారులు సన్నిద్ధమవుతున్నారు. భక్తుల రక్షణ, ఇసుక తిన్నెల పొడవు, నది లోతు వెడల్పు ప్రామాణికంగా తీసుకుని కాలినడక రహదారి మార్గం ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని, భక్తులు రాకపోకలు సాగించేందుకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా ఉండేవిధంగా కాలినడక రహదారి మార్గం ఏర్పాటు చేయడం జరుగుతుందని తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్, బోటు సూపరిటెండెంట్ చైతన్య కుమార్, ఫెర్రీ కాంట్రాక్టర్ బొరుసు రాంబాబు, సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది వున్నారు.


ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలి

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో సర్పంచులు

ఏలూరు అర్బన్ : 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచుల ఖాతాలో జమ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అండ్ సర్పంచుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు వెంటనే సర్పంచుల ఖాతాలో జమ చేయాలని, సచివాలయ వాలంటీర్లను గ్రామపంచాయతీలో విలీనం చేయాలని, ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచిల అధికారాన్ని హరించకుండా సర్పంచిల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈ దీక్షకు మద్దతు తెలిపిన మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో సర్పంచులుగా ఎన్నికైన వారికి నేడు భిక్షాటన చేసే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించిందని, సర్పంచి వ్యవస్థను నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో సర్పంచిలకు పూర్తి అధికారాలు, స్వేచ్ఛ ఇచ్చామని, పంచాయతీలకు రావాల్సిన నిధులు ఈ ప్రభుత్వం దారి మళ్లించడం సిగ్గుచేటని విమర్శించారు. సర్పంచులు చేసే న్యాయమైన పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గూడపాటి కేశవరావు, బలరామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం అమలు ఘనత జగన్‌దే

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్


గాంధీకి నివాళులర్పిస్తున్న పద్మశ్రీ

ఏలూరు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంతం అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘాలవారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం తదితర ప్రాధాన్యత పనులను చేపట్టి గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలూ చేపట్టలేని అనేక సంక్షేమ పథకాలు నవరత్నాలు ద్వారా ప్రజలకు నూరుశాతం అందించారని చెప్పారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్న సందర్భంగా స్థాయిసంఘ సమావేశం చివరిసారిగా నిర్వహించుకుంటున్నామని, అదేవిధంగా ఫిబ్రవరి 10న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశానికి జిల్లా అధికారులు తప్పక హాజరవ్వాలని స్పష్టం చేశారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సంఘ సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిప్యూటీ సిఇఒ నిర్మలాజ్యోతి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే వైసిపి లక్ష్యం

కలిదిండి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గుర్వాయిపాలెం, మద్వానిగూడెం, ఉప్పుటేరు వద్ద రూ.2.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రేవును, రూ.8 లక్షలతో నిర్మించిన త్రీ ఫేస్ విద్యుత్ లైన్‌ను, హరిజనవాడ సిఎస్ఎ వద్ద రూ.20 లక్షల ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్మించిన నూతన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి ప్రెసిడెంట్ కొల్లాటి సత్యన్నారాయణ, సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, మసిముక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడులో 'వైఎస్ఆర్ ఆసరా'

నూజివీడు రూరల్ : జగన్ ఓడిపోతే ఇప్పుడు వస్తున్న సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలో మంగళవారం వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం జగన్ అన్ని వర్గాలకు అద్భుతమైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ముఖ్యంగా మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీ ఇచ్చి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టిమి విధానంపై అవగాహన

నూజివీడు రూరల్: నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం స్టిమి విధానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మోహన్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ స్టిమి విధానంతో గుండుపోటు మరణాలకు తావు లేదని, గుండెనొప్పి వచ్చిన వారిని ఆసుపత్రికి తరలిస్తే స్టిమి అనే నూతన విధానంలో తక్షణమే చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఛాతి, చిటికెన వేలు వద్ద వచ్చే నొప్పులను గుండెపోటుగా గుర్తించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారెంటీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముదినేపల్లి : టిడిపి చేపట్టిన బాబు షూ్యరిటీ-భవిష్యత్తు గ్యారెంటీని ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌ఛార్జి కె.వినోద్ తెలిపారు. ముదినేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు భవిష్యత్తు గ్యారంటీ కుటుంబ సాధికార సారథుల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుభాష్, మేకా విజయ్ కుమార్, వాక కళ్యాణ్‌లు శిక్షణ ఇచ్చారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు

ఏలూరు అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి ఏలూరులోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం పున్ణనిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు పాలకమండలి సభ్యులు నెరుసు నాగ సత్యం యాదవ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఏలూరు గ్జేవిఎర్ నగర్‌లో ప్రస్తుతం ఉన్న ఈ మండపం సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ భవనం స్థానంలో సుమారు 30 వేల అడుగుల విస్తీర్ణంలో నూతన భవన పున్ణనిర్మాణానికి అంచనాలు సిద్ధంచేశామన్నారు. ఆధునిక సౌకర్యాలతో సువిశాల కళ్యాణ మండపం నిర్మాణం జరుగుతుందని నాగసత్యం వెల్లడించారు.

'జగనన్న సురక్ష' ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి

భీమడోలు : ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి వచ్చాయని దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామ సర్పంచులు నీలం శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు అన్నారు. వీరు స్థానిక ఎంపిటిసి పి.శ్రీనివాసరావుతో కలిసి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమడోలు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రత్యేక వైద్య నిపుణులు, ఉన్నత స్థాయి వైద్యులు వైద్య సేవలను అందించారు. శిబిరంలో 425 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

వృత్తి విద్యా నైపుణ్యంపై అవగాహన

జీలుగుమిల్లి : విద్యార్థుల్లో వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.పెద్దిరాజు తెలిపారు. మంగళవారం బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాల, కోటరామచంద్రపురం గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంలో భాగంగా ఒకేషనల్, ఇండస్ట్రియల్ క్షేత్ర పర్యటనలకు స్థానిక సిటిఆర్ఐకు తీసుకెళ్లి వివిధ రకాల వాణిజ్య పంటల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమేష్, వెంకయ్య, వృత్తి విద్య బోధకులు, బాబు ప్రశాంత్, బృందం పాల్గొన్నారు.

వాహనాల ఆకస్మిక తనిఖీ

నూజివీడు రూరల్: లైసెన్సులు లేకుండా వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని సిఐ మూర్తి హెచ్చరించారు. నూజివీడు పట్టణ సిఐ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వివిధ వాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎటువంటి రికార్డులు లేని వాహనాలపై పోలీసులు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు.

రంజిత్ కుమార్‌కు వారెంట్

నూజివీడు రూరల్: విజిలెన్స్ సబ్ ఇన్స్‌పెక్టర్ రంజిత్ కుమార్‌కు నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం బైలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. విచారణ చివరి దశలో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వడానికి కోర్టుకు హాజరు కానందుకు ఏలూరు ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న రంజిత్ కుమార్‌కు ప్రత్యేక న్యాయమూర్తి వారెంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

పార్లమెంట్ కోకన్వీనర్‌గా కోటప్రోలు కృష్ణ నియామకం

ముదినేపల్లి : ప్రస్తుతం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి బాధ్యతలు నిర్వహిస్తున్న ముదినేపల్లికి చెందిన కోటప్రోలు కృష్ణను బిజెపి అధిష్టానం ఇప్పుడు ఏలూరు పార్లమెంట్ కో- కన్వీనర్‌గా నియమించింది. ఈ సందర్భంగా కోటప్రోలు కృష్ణ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి తపన చౌదరికి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీనారాయణకి అభినందనలు తెలిపారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ, నియంత్రణ, దుర్వినియోగం, నివారణ చట్టంపై అవగాహనా సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న రత్నప్రసాద్

చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వైద్య పరీక్షా కేంద్రాలపైన, హాస్పటల్స్‌పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సేవాధికార సంస్థ భవనంలో జిల్లాలోని రేడియాలజిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు, పిసి, పిఎన్‌డిటి యాక్ట్(ముందస్తు లింగ నిర్ధారణ, నియంత్రణ, దుర్వినియోగం నివారణ చట్టం)పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ సంబంధిత డాక్టర్ల అనుమతితోనే పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష వివరాలను బయటకు వెలువరించరాదన్నారు. నేటి సమాజంలో భ్రూణ హత్యలు పెరిగాయని, శిశువు ఆడ, మగ తెలుసుకుని పితృస్వామ్య వారసత్వ చట్టాలు, సాంస్కృతిక పద్ధతుల కారణంగా సాంప్రదాయకంగా ఆడపిల్లల కంటే మగ పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మగ బిడ్డ పుట్టే వరకు కుటుంబాలు పిల్లల్ని కలిగి ఉండటం కొనసాగిస్తున్నారని, ఆడ శిశువులను వధించడం జరుగుతుందని, క్రమంగా సమాజంలో స్త్రీల సంఖ్య తగ్గిపోతుంది కాబట్టి వీటిని నివారించడానికి చట్టాన్ని రూపొందించారని తెలియజేశారు. వైద్య పరీక్షా కేంద్రాలు ఎటువంటి ఒత్తిడిలకు తలవంచకుండా చట్టప్రకారం నడుచుకోవాలని, అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో ఈ చట్టం విధివిధానాలు ప్రదర్శించే బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం కమిషన్ మెంబర్ కెఎస్.నాగలక్ష్మి, డిప్యూటీ డెమో నాగరత్నం, ప్యానల్ లాయర్ జివి.భాస్కర్, జిల్లాలోని రేడియాలజిస్టులు పాల్గొన్నారు.

దోసపాడు దళితుల గోడు ముఖ్యమంత్రికి పట్టదా..?

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

దెందులూరు : దోసపాడు దళితులు, పేదల పట్ల రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం దెందులూరు మండల తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసైన్డ్, సీలింగ్ భూముల పంచాయితీ, భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ ఎంక్వయిరీ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితుల పట్ల మండల రెవెన్యూ శాఖ అధికారులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రెండేళ్ల నుంచి పేదలు, దళితులు మొక్కవోని దీక్షతో పోరాడుతుంటే వీళ్ల పైన 144, 145 సెక్షన్ల కింద రెవెన్యూ శాఖ అధికారులు కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. మరోపక్క భూస్వాములు అక్కడే నివాసం ఉంటున్న వారిపైన ఎలాంటి కేసులు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో పేదలకు ఒక చట్టం భూస్వాములకు మరో చట్టం అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పేదలందరూ ఐక్యంగా వారి భూముల కోసం పోరాడుతుంటే ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. చేపల చెరువులో ఉన్న పంటను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సింది పోయి ఆ పంట భూస్వాములు కట్టపెట్టేలా చట్టాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఫిబ్రవరి 3వ తేదీన దెందులూరు నియోజకవర్గం పర్యటన చేస్తున్న నేపథ్యంలో దోసపాడు దళితుల గోడు పట్టించుకోవాలని కోరారు. దళితులు, పేదలపట్ల వివక్ష చూపుతున్న రెవెన్యూ శాఖ అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న 74 ఎకరాల అసైన్డ్ భూముల సుమారు 62 మంది పేదలు పేర్లే ఉన్నా ఆ రికార్డులను తారుమారు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.నాగేశ్వరరావు, డి.నాగేంద్ర, మనీ, భూ పోరాట నాయకులు సిహెచ్.జాన్ రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ముదినేపల్లి : మండలంలోని పెదగొన్నూరు పంచాయతీ విశ్వనాధ్రి గ్రామంలో మంతెన పాపారావు కుమారుడు మంతెన దావీదు(17) క్యాన్సర్‌తో మంగళవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి యువనేత కొడాలి వినోద్ దావీదు భౌతికకాయానికి నివాళులర్పించి, మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసి, ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

వాలీబాల్ పోటీల్లో అంబరు పేట జట్టు విజయం

ప్రజాశక్తి - భీమడోలు


అంబరు పేట జట్టును అభినందిస్తున్న సర్పంచి, కార్యదర్శి

ఆడుదాం ఆంధ్ర ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో భీమడోలు మండలం పలు పతకాలను, నగదు ప్రోత్సాహకాలను సాధించిందని ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. నియోజకవర్గస్థాయి పోటీలను నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలలో మంగళవారం వరకు నిర్వహించారు. దీనిలో భాగంగా వాలీబాల్ పోటీల్లో భీమడోలు మండలానికి చెందిన అంబరు పేట జట్టు ప్రథమ స్థానం దక్కించుకుని రూ.20 వేల నగదు పురస్కారాన్ని సాధించిందన్నారు. కబడ్డీ పోటీల్లో పూళ్ల జట్టు రెండవ స్థానాన్ని సాధించిందని, రూ.10 వేల నగదు పురస్కారాన్ని దక్కించుకుందన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పూళ్ల జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుని రూ.10 వేల నగదు పురస్కారాన్ని సాధించిందన్నారు. మహిళల విభాగం ఖోఖోలో పూళ్ల జట్టు తృతీయ స్థానం దక్కించుకుని రూ.5 వేల నగదు పురస్కారాన్ని దక్కించుకుందన్నారు. బాల్ బ్యాడ్మింటన్‌లో పూళ్ల మహిళల జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకొని రూ.10 వేల నగదు పురస్కారాన్ని సాధించిందన్నారు. క్రికెట్ పోటీల్లో భీమడోలు జట్టు తృతీయ స్థానాన్ని సాధించి రూ.5 వేల నగదు పురస్కారాన్ని దక్కించుకుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు.

ఎత్తిపోతల పథకం పట్ల ప్రభుత్వ వైఖరి దారుణం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చింతలపూడి ఎత్తిపోతల పథకం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా నాలుగున్నర సంవత్సరాల పాటు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. నాబార్డ్ నుంచి నిధులను తీసుకొని పూర్తి చేస్తామని మాటలు చెప్పి ఆచరణలో అటకెక్కించిందని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పంపు హౌస్ పూర్తిస్థాయి తుప్పు పడుతున్న పరిస్థితి ఏర్పడిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూములు కోల్పోతున్న రైతులు న్యాయమైన పరిహారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారని, గత ఎన్నికల ముందు భూ నిర్వాసిత రైతులకు అన్ని విధాల ఆదుకుంటానని చెప్పి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించి, ప్రాజెక్టును పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో రైతులు మరలా ఉద్యమానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.


మద్దతుగా మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నూజివీడు రూరల్: నిలిపివేసిన చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, 2 నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నూజివీడు సబ్ కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.రాజు వారికి మద్దతు తెలిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని, దాని వలన రైతులు నష్టపోయారని, వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. మార్కెటింగ్ యార్డ్ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో రైతాంగానికి పోలవరం ప్రాజెక్టు, నూజివీడు నియోజకవర్గ పరిధిలోని చింతలపూడి ఎత్తిపోతల పథకాలను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి రైతాంగాన్ని నట్టేట ముంచిందన్నారు. టిడిపి, జనసేనల ప్రభుత్వంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

గంజాయి నియంత్రణకు చర్యలు


జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : గంజాయి నియంత్రణలో నిఘా పెంచడంతో పాటు గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నార్కో కోఆర్డినేషన్ సెంటర్(ఎన్‌సిఒఆర్‌డి) జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. గంజాయి నియంత్రణ, డ్రగ్స్ అక్రమ రవాణా తదితర అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా ఎన్ని కేసుల నమోదు, ఎంత పరిమాణం స్వాధీనం చేసుకుంది, పాత, కొత్త కేసులకు సంబంధించి కోర్టుల్లో ఎన్ని విచారణకు వచ్చింది, జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి నియంత్రణకు జిల్లా యంత్రాంగం తరపున ఏవిధమైన సహకారం అవసరమో తదుపరి నెలలో నిర్వహించే సమావేశం నాటికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పూర్తిస్థాయి నిఘా పెట్టాలన్నారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ గంజాయి రవాణా, సరఫరా, వినియోగం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిఇఒ పి.శ్యామ్ సుందర్, ఉప రవాణా కమీషనర్ ఎస్.శాంతకుమారి పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

ఆందోళ చేపట్టిన కుటుంబీకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం


మృతుడు
ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

టిప్పర్, లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రీన్ ఫీల్డ్ హైవేపై మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురంలో గ్రామానికి చెందిన పెసనగంటి మరియన్న(58) పొలం పనుల నిమిత్తం నూతనంగా నిర్మితమవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే మీదుగా వెళుతున్న క్రమంలో హైవేపై మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుని భార్య బుజ్జి, కుమారుడు మంగరాజులు తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించడానికి వీలులేదని అంబేద్కర్ సెంటర్‌లో కొంతసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం పోలవరం నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి లంకా జయబాబు ఆధ్వర్యంలో టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో రహదారిని నిర్బంధించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జయబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్నా విరమించేది లేదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగపోతే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. సంఘటనా స్థలాన్ని జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్ సందర్శించి టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పల్లిపాం జోసెఫ్ తంబీ, నాగేంద్రబాబు, బర్రె సత్యనారాయణ, నందిపాం రవి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని జగన్ సాకారం చేశారు

గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి

పోలవరం : గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని వైసిపి ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాకారం చేశారని ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. ఆంగ్లేయుల పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్రం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు, జాతిపిత మహాత్మా మోహన్ దాస్ కరంచంద్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పోలవరం మండలం గూటాల గ్రామంలో మంగళవారం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సత్యం, అహింస తన ఆయుధాలుగా స్వతంత్ర పోరాటం చేసి జాతిపితగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కలిదిండి : గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఊర శ్రీధర్, ఎంపిటిసి నీలి సుమన్, వాసవి క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షులు బత్తుల రఘు రామ్, పలివెల ప్రకాశరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

టి.నరసాపురం : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహా వ్యక్తి గాంధీజీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాదంశెట్టి మల్లికార్జున రావు, అద్దంకి రవి, అద్దంకి రామకృష్ణ, మండం ఆదిత్య కుమార్, నల్లూరి శ్రీనివాస్, పసుమర్తి రాము, పరిమి నాగేశ్వరరావు, కొనకల్ల శ్రీనివాస్, అద్దంకి జగ్గారావు, జూలూరి నగేష్ పాల్గొన్నారు.

కుష్టురహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

సర్పంచి సునీత మాన్సింగ్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీని ఇప్పటికే పోలియో రహిత, మశూచి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామని, దీనిని కుష్టు వ్యాధి రహిత గ్రామంగా. తీర్చిదిద్దేందుకు సహకరించాలని గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ కోరారు. మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. దీనిలో భాగంగా స్పర్శ కార్యక్రమం పేర కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి, గ్రామపంచాయతీ కార్యదర్శి, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ కె.లక్ష్మి, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్ గ్రామస్తులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తారని, ప్రాథమిక దశలోనే కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తింపు చేయటం వంటి కార్యక్రమాలు చేపడతారన్నారన్నారు. పిహెచ్‌సి డాక్టర్ కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 21 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. నూతనంగా ఏవిధమైన కేసులు నమోదు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'సాయి రమేష్ సేవలు ఆదర్శం'

ప్రజాశక్తి - భీమడోలు

మూగజీవాలకు సేవ చేయటం ఉద్యోగ ధర్మంగా భావించి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో కొనసాగిస్తున్న పశుసంవర్ధక శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ జక్కుర్తి సాయి రమేష్ సేవలు పలువురికి ఆదర్శప్రాయమని పశువైద్యులు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పశువైద్యులుగా అవార్డు పొందిన భీమడోలు సహాయ సంచాలకులను భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని పశువైద్యులు, సిబ్బంది మంగళవారం స్థానిక పశువైద్యశాలలో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రమేష్ మాట్లాడుతూ తనకు ఇంతటి గుర్తింపు రావడానికి సబ్ డివిజన్ పరిధిలోని ఇతర పశువైద్యులు, సిబ్బంది అందించిన సహాయ, సహకారాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ కృష్ణప్ప, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ఇంద్రజ, డాక్టర్ చలపతిరావుతో పాటు సిబ్బంది షరీఫ్ పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

టి.నరసాపురం : మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేయడానికి తాత్కాలిక ప్రాతిపదికన గణితం బోధించే ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డిఎస్ బి.శంకర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గణితం బోధించడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం, బిఇడిలో 50 శాతం మార్కులు అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 2వ తేదీన అన్ని సర్టిఫికెట్‌లతో పాఠశాలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని ఆయన తెలియజేశారు.